


# నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### తెలివిగల వాళ్ళు

**ఓ కాన్ఫరెన్సుకి** హాజరవడానికి ముగ్గురు ఇంజినీర్లు, ముగ్గురు అకౌంటెంట్లు వెళుతున్నారు. ముగ్గురు అకౌంటెంట్లు తమ ముగ్గురికి టిక్కెట్లు కొన్నారు కానీ ముగ్గురు ఇంజినీర్లు కలిపి ఒకే టిక్కెట్టు కొనడం చూసి ఆశ్చర్యపోయిన అకౌంటెంట్లు అడిగారు, ఒకే టికెట్ మీద ముగ్గురెలా ప్రయాణం చెయ్యగలరని.

"మీ అకౌంటెంట్లకి ఇంజినీరింగ్ బుర్ర అర్థంకాదు కాని, జరిగేది చూస్తుండండి" వాళ్ళలో ఒకడు దురుసుగా జవాబిచ్చాడు.

రైల్లో అంతా తమ తమ స్థానాల్లో కూర్చున్నారు. కొద్ది సేపటికి ఆ కంపార్ట్‌మెంట్లోకి టిక్కెట్లు చెక్ చెయ్యడానికి టి.సి రాగానే ఇంజినీర్లు ముగ్గురూ లేచి బాత్ రూమ్ లోకి వెళ్ళి తలుపు గడియపెట్టుకున్నారు.

అకౌంటెంట్ల టిక్కెట్లు చెక్ చేశాక టి.సి బాత్ రూమ్ తలుపు నెట్టి చూసి లోపల ఎవరో ఉన్నారని గ్రహించి తలుపును తడుతూ గట్టిగా అడిగాడు

"టికెట్ ప్లీజ్.."

బాత్ రూమ్ తలుపు చెయ్యి పట్టేంతమేర తెరుచుకుంది, లోపలి నుంచి వచ్చిన చేతిలోని టిక్కెట్ని చూసి తృప్తిపడి ముందుకివెళ్ళిపోయాడు టి.సి.

ఇంజినీర్లు వచ్చి తమ సీట్లో కూర్చున్నాక అడిగారు అకౌంటెంట్లని

"తెలివి మా సొత్తు కదా?"

"అవును" అంగీకరించారు అకౌంటెంట్లు.

కాసేపు ఆ ముగ్గురు అకౌంటెంట్లు ఆ విషయం మీద రహస్యంగా చర్చించుకున్నారు. కాన్ఫరెన్సు అయ్యాక అకౌంటెంట్లు రెండు టిక్కెట్లనే కొనడం గమనించారు ఇంజినీర్లు.

"ఇదేమిటి మూడో వాడికి టికెట్ కొనరే..?" అడిగారు వాళ్ళు.

"తెలివి ఒక్కరి సొత్తుకాదు.. జరిగేది మీరే చూస్తుండండి.." జవాబు చెప్పారు అకౌంటెంట్స్.

ఎప్పటిలా ఇంజీర్లు ముగ్గురూ కలిపి ఒక్కటే టికెట్ కొన్నారు. అంతా రైల్లోకి ఎక్కారు. కొద్దిసేపటికి టి.సి తమ కంపార్ట్‌మెంట్లోకి రావడం గమనించిన ఇంజినీర్లు ఎప్పటిలానే బాత్రూమ్ లోకి వెళ్ళి తలిపేసుకున్నారు. కొద్ది సేపటికి ఒక అకౌంటెంట్ లేచి వెళ్ళి బాత్ రూమ్ తలుపు తట్టి

"టికెట్ ప్లీజ్.." అన్నాడు.

బాత్రూమ్ తలుపు కొద్దిగా తెరుచుకుని అందులోంచి ఓ చేయి టిక్కెట్‌తో బయటికి వచ్చింది. అకౌంటెంట్ టిక్కెట్ ని తీసుకుని గప్‌చిప్‌గా వచ్చి తన సీట్లో కూర్చున్నాడు..!! ***

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"ఏమిట్రా మూర్తీ నిన్నటి వరకు మంచి హుషారుగా ఉన్నావు. హఠాత్తుగా అలా బిక్క మొహవేశావేమిటి?"

"మా అత్తగారిని ఎవరోగానీ ఎత్తుకుపోయారు. వారం రోజులయింది."

"అరే పాపం ఆచూకీ ఏమయినా తెలీలేదా?"

"వాళ్ళెవరోగానీ చీటీ పంపారు. వెంటనే యాభైవేల రొక్కం అందజేయమన్నారు రేపొద్దుటిలోగా"

"ఇవ్వకపోతే ఏం చేస్తారట?"

"మా అత్తగారిని తిరిగి భద్రంగా మా ఇంట్లో వదిలి పెట్టేస్తారట. ప్చ్."

“ ఏం హోటలయ్యా మీది వానపడితే రూములన్నీ ఒకటే కురుస్తున్నాయి" అని ఫిర్యాదు చేశాడు శేషారావు హోటలు మేనేజరుతో.

"మేం ముందుగానే చెప్పాం కదా సార్ ప్రతి రూములోనూ ఇరవై నాలుగ్గంటలూ నీటి సౌకర్యం ఉంటుందని"

"నాన్నా! నాకు పాతికేళ్ళొచ్చాయి. ఇక పెళ్ళి చేసుకుందామని ఉంది."
"వద్దురా బాబూ ఇంకా నీ బుద్ది పరిపక్వం కాలేదు. అయిన తరువాత చేసుకుందువు గాని"
"నా బుద్ది పరిపక్వమెప్పుడవుతుంది నాన్నా?"
"పెళ్ళి చేసుకుందామనే ఆలోచన పోయినపుడే నీకు మానసిక వికాసమైనట్టు. అనుభవం మీద చెప్తున్నానురా కన్నా"

రెండో క్లాసులో పాఠం చెప్తున్నాడూ లెక్కల మాస్టారు.
"లక్ష్మీ చూడమ్మా. మీ నాన్నగారి జీతం అయిదొందలు. ఒకటో తారీఖున ఆయన జీతం పుచ్చుకుని, అందులో సగం మీ అమ్మకు ఇచ్చారనుకో, ఆమె దగ్గర ఎంతుంటుంది?"
"అది నాకు తెలియదు మాస్టారు. కానీ ఆ రోజంతా మా అమ్మకు గుండెనొప్పి వస్తుంది. పిల్లలం ఎవరయినా పలకరిస్తే మాకు కసుర్లు, దెబ్బలు తప్పవు."

"ఈడెన్ గార్డెన్‌లో ఆడం ఆ పండును చెట్టునుండి కోసి కొరుక్కుతింటానికి కారణమేమిటి?" అని బైబిలు ప్రవచనాలు చెప్పిన తర్వాత ఫాదర్ అడిగాడు.
"అప్పుడతని దగ్గర చాకులేకపోవటం" ఠక్కున జవాబు చెప్పాడు ఓ యువకుడు.

COMMENTS